క్లుప్తంగా

లెప్రసీ నివారణకు సర్వే


ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: లెప్రసీ నివారణే లక్ష్యంగా ఇంటింటి సర్వే చేస్తున్నట్టు వైద్యాధికారి సీతారామ లక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని సబ్ సెంటర్ల పరిధిలోనూ వైద్య సిబ్బంది ఈ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి వచ్చే నెల 12 వరకు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. లెప్రసీ లక్షణాలను ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. లక్షణాలున్న వారిని పీహెచ్‌సీకి తరలించి పరీక్షిస్తామన్నారు. వ్యాధిని ఆదిలోనే గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేయాలని ఆదేశాలిచ్చినట్టు చెప్పారు.

వీవోఏపై డ్వాక్రా మహిళల ఫిర్యాదు


ఇన్‌చార్జి ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న రాచపల్లి డ్వాక్రా మహిళలు

మాకవరపాలెం: వెలుగు వీవోఏపై విచారణ చేపట్టాలని రాచపల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘ సభ్యులు ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ పెట్ల దొరబాబుతో కలసి గురువారం ఫిర్యాదు ప్రతం అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాల పంపిణీలో వీవోఏ వసూళ్లకు పాల్పడటంతోపాటు గత ప్రభుత్వంలో మంజూరైన పసుపు కుంకుమ నగదు కొందరు సభ్యులకు ఇప్పటికీ అందలేదని అందులో పేర్కొన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ నగదును సభ్యుల ఖాతాల్లో జమ చేయలేదని, ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

దివ్యాంగులకు రగ్గులు వితరణ


దివ్యాంగులకు రగ్గులు, వాటర్‌బాటిళ్లు అందిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ వారి ఉన్నతికి చర్యలు తీసుకుంటున్నారని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. గురువారం తురువోలు భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచాలకు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయుడు బొడ్డు మహలక్ష్మీనాయుడు తన సొంత నిధులతో దివ్యాంగులకు రగ్గులు, వాటర్‌బాటిళ్లు వితరణ చేశారు. వాటిని ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బొంజుబాబు, సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పి.టి.బాబు, సరస్వతి, అనురాధ పాల్గొన్నారు.

టైటస్‌కు నేషనల్ ప్రైడ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న గొర్లె టైటస్

దేవరాపల్లి: నిస్సీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డాక్టరు గొర్లె టైటస్ నేషనల్ ప్రైడ్ అవార్డు-2023ను అందుకున్నారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఇందిరా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో గురువారం జాతీయ సాహితీ కళా సేవా ప్రతిభా పురస్కారాలు-2023 ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. పలు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి, కళాకారులు, రచయితలకు వీటిని అందజేసి సత్కరించారు. కొన్నేళ్లుగా గిరిజన, మారుమూల గ్రామాల ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి టైటస్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. సినీ నటుడు డాక్టరు బి.గౌతమ్ రాజ్, తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాత్యారి కృష్ణంరాజు ప్రదానం చేశారు.


కె.కోటపాడులో హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు


మాడుగులలో బ్యాడ్మింటన్ పోటీలో విద్యార్థులు

రసవత్తరంగా 'ఆడుదాం.. ఆంధ్రా'

- పలు అంశాల్లో పోటీలు
- 3వ రోజు పోటీపడ్డ క్రీడాకారులు

ఆడుదాం – ఆంధ్రా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు నువ్వా.. నేనా అన్నట్టుగా పోటీపడుతున్నారు. వీరిలో పలువురు ప్రతిభ చాటి మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో మూడో రోజు గురువారం ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి.


చీడికాడ: బైలపూడి ఉన్నత పాఠశాలలో క్రికెట్ ఆడుతున్న బాలికలు


కె.కోటపాడు: చౌడువాడలో షటిల్ ఆడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి


రోలుగుంట: కొవ్వూరులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు


బుచ్చెయ్యపేట: వడ్డాదిలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

కె.కోటపాడు: గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభమైన ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వీటిల్లో పాల్గొంటున్న క్రీడాకారులు విజయం సాధించాలనే లక్ష్యంతో ఉత్తమ ప్రదర్శన ఇస్తున్నారు. కె.కోటపాడు, పాతవలస, ఎ.కోడూరు, కొరువాడ, గొండుపాలెం, చౌడువాడ గ్రామాల్లోని హైస్కూల్ క్రీడా మైదానాల్లో కబడ్డీ, షటిల్, ఖో–ఖో పోటీలను నిర్వహించారు. వీటిని చౌడువాడలో మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో ప్రసాద్ గురువారం పరిశీలించారు. పోటీల నిర్వహణను పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్‌తోపాటు పీడీలు రోహిణీ, లక్ష్మి, దేముళ్లు పర్యవేక్షించారు.

మాడుగుల: మండలంలో కేజేపురం, ఎం.కోడూరుల్లో ఆడుదాం .. ఆంధ్రా పోటీలను మండల ప్రత్యేకాధికారి ఎం. పోలినాయుడు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ పరిశీలించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాళీ ఆధ్వర్యంలో మహిళా వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ: ఆడుదాం – ఆంధ్రాలో భాగంగా మూడో గురువారం మండలంలోని 13 సచివాలయాల పరిధిలో బాల, బాలికల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు.

బుచ్చెయ్యపేట: వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌లో శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్చిపురం, వడ్డాది, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించారు. సీతయ్యపేట, దిబ్బిడి, విజయరామరాజుపేట, పెదమదీన, తురకలపూడి తదితర గ్రామాల పాఠశాలల్లో ఆటల పోటీలు రసవత్తరంగా సాగాయి. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణ మూర్తి, గంపా చినబాబు పర్యవేక్షించారు.

రోలుగుంట: మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో × ఆడుదాం ..ఆంధ్రా పోటీలు గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా కొవ్వూరులో క్రికెట్ పోటీలను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కె.నూకరాజు ప్రారంభించారు. ఈ నెల 29న ఖోఖో, 30న కబడ్డీతో ఈ పోటీలు ముగుస్తాయని ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ తెలిపారు.

రావికమతం: స్థానిక హైస్కూల్‌లో మహిళలు కబడ్డీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యదర్శి పాతాళ సత్యారావు, పీడీ లక్ష్మణరావు అంపైర్లుగా వ్యవహరించారు. కొత్తకోట హైస్కూల్‌లో కబడ్డీ, షటిల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు రిఫరీలుగా వ్యవహరించారు.

కొత్తకోటలో దుకాణ సముదాయం ప్రారంభం నేడు


కొత్తగా నిర్మించిన దుకాణ సముదాయం

రావికమతం: అందుబాటులోని వనరులను సద్వినియోగించుకుని పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్తకోట మేజర్ పంచాయతీలో నాబార్డు రుణ సహాయంతో నిర్మించిన దుకాణ సముదాయం శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా మాట్లాడుతూ సంతల్లో గ్రామీణులకు వారానికి సరిపడా నిత్యావసరాలు లభిస్తాయన్నారు. చోడవరం తర్వాత పెద్ద గ్రామమైన కొత్తకోటలో ఇటువంటి దుకాణ సముదాయం నిర్మిస్తే ఇక్కడ చుట్టు పక్కల గ్రామాల ప్రజల అవసరాలు తీరడమేగాక పంచాయతీకి ఆదాయ వనరుగా ఉంటుందన్నారు. ఈ మేరకు పంచాయతీ నుంచి రూ.3 లక్షలు, నాబార్డు నుంచి రూ.15 లక్షలతో దుకాణ సముదాయాలు పూర్తి చేశామన్నారు. త్వరలోనే గిడ్డంగులతోపాటు కోల్డ్ స్టోరేజిలు నిర్మించేందుకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ హామీ ఇచ్చారన్నారు. వీటి వల్ల రోడ్డుకు ఇరువైపులా చిరుదుకాణదారుల బెడద లేకుండా ఇక్కడ ఏర్పాటు చేసుకోవచ్చని, తద్వారా ట్రాఫిక్ కష్టాలు తొలగుతాయన్నారు.

పేదలకు ఖరీదైన వైద్యం


లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాతవరం: పేదలకు ఖరీదైన వైద్యం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. నాతవరం, పెదగొలుగొండపేట పంచాయతీల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రధానమంత్రి మోదీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులకు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచులు గొలగాని రాణి, మిరపల వెంకటరమణ, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు పోలుపర్తి వెంకటరమణ, చెక్కా జోగిరాజు, తమరాన సత్యనారాయణ, నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

ఎ.భీమవరంలో చెరకు రవాణా ప్రారంభం


బోయిలకింతాడ చెరకు కాటా వద్ద పూజలు చేస్తున్న బూరె బాబూరావు


కాటా కేంద్రం వద్ద చెరకు వేస్తున్న శేషు, తాతయ్యబాబు

కె.కోటపాడు: ఎ.భీమవరం చెరకు కాటా కేంద్రం నుంచి చెరకు రవాణా గురువారం ప్రారంభమైంది. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం కావడంతో చెరకు కాటాల నుంచి రైతులకు పర్మిట్లను ఫీల్డ్‌మెన్లు జారీ చేస్తున్నారు. ఈ మేరకు ఇక్కడ కాటా నుంచి చెరకును తరలింపును వైఎస్సార్‌సీపీ నాయకుడు తర్రా శేషు, రైవాడ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తర్రా శేషు మాట్లాడుతూ ఎ.భీమవరం, కొత్తపెంట, అలమండ, ఎ.కొత్తపల్లి, పాడుగుపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఏటా తూనికా కేంద్రం నుంచి 40 వేల టన్నుల చెరకును తరలించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డి.దేముళ్లు, తర్రా నారాయణరావు, తర్రా మోహన్‌రావు, కె.ధనుంజయ్, మడక సత్యనారాయణ పాల్గొన్నారు.

బోయిలకింతాడ చెరకు కాటా వద్ద పూజలు

దేవరాపల్లి: బోయిలకింతాడ చెరకు కొనుగోలు కేంద్రం(చెరకు కాటా) వద్ద చెరకు రవాణాను వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు గురువారం ప్రారంభించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ ప్రారంభమైన నేపథ్యంలో సభ్య రైతులు, ఫ్యాక్టరీ సిబ్బందితో కలిసి పూజలు చేశారు. వ్యవసాయ శాఖ మండల సలహా సంఘం చైర్మన్ అన్నం రామునాయుడు, మాజీ ఫీల్డ్‌మెన్ అన్నం రాము, చెరకు కొనుగోలు కేంద్రం ఏవో కృష్ణమూర్తి, ఫీల్డ్ సిబ్బంది బేరా నారాయణరావు, గొర్లె రామకృష్ణ, డి.మాలినాయుడు, బుగత బాబూరావు, శరగడం రమేష్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన యువజన నాయకుడు


డిప్యూటీ సీఎం బూడిని సత్కరిస్తున్న యువజన విభాగం అధ్యక్షుడు గోపాల్ తదితరులు

మాడుగుల: నూతనంగా నియమితులైన యువజన విభాగం మండలాధ్యక్షుడు కలిమి గోపాల్ గురువారం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎంతోపాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అప్పాన నాయుడు, కలిమి సంతోష్, జల్లి రాంమూర్తి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్ తీసుకున్న హెచ్‌ఎంలు

రోలుగుంట: మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కాళింగ సతీష్ గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ యూనియన్ నిధులతో నిష్ణాతులతో ఈ మెటీరియల్ తయారు చేయించామన్నారు. వీటిని పదో తరగతి విద్యార్థులు చదువుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

కుష్టు వ్యాధి సర్వే ప్రారంభం

మాడుగుల రూరల్: కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో ఆశ కార్యకర్త, వలంటీర్లు ఇంటింటి సర్వే చేస్తున్నారు. వచ్చే నెల 12వ తేది వరకు ఈ సర్వే నిర్వహిస్తామని వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు గురువారం తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ

బుచ్చెయ్యపేట: మండలంలోని తురకలపూడి జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ రాంబాబు గురువారం ఉచిత ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మండలంలో ఎనిమిది హైస్కూళ్లు, కేజీబీవీలో చదువుతున్న 680 మంది విద్యార్థులకు వీటిని ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. పేద పిల్లలకు ఉన్నత చదువులు అందించి వారిని ప్రయోజకుల్ని చేయాలన్న సంకల్పంతో సీఎం జగనన్న వీటిని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

రీసర్వేలో లోటుపాట్లు సరిచూసుకోవాలి


రైతులకు నోటీసులందిస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోటలో రీసర్వే పూర్తయిన రైతులకు 9/2 నోటీసులు ఇస్తున్నామని ఆర్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. రీసర్వే ప్రకారం ఏయే రైతులకు ఎక్కడెక్కడ ఎంతెంత భూమి ఉందో తెలియజేస్తున్నామన్నారు. తప్పొప్పులున్నా రైతులు తమను సంప్రదించాలని, అప్పుడే మరోసారి సర్వే చేయడానికి వీలవుతుందన్నారు. సర్పంచ్ కోన లోవరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస

- టీడీపీ కౌన్సిలర్ల తీరుపై చైర్‌పర్సన్ అసహనం
- వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి


వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల వాగ్వాదం

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల తీరుపై చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అసహనం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు 40 ఏళ్లుగా నర్సీపట్నాన్ని గాలి కొదిలేస్తే, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తుంటే టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ముందుగా ఎజెండాలోని అంశాలను సభలో చదివి వినిపించారు. టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి లేచి ల్యాండ్ ఎక్విజేషన్ ప్రకటనలో మెయిన్ రోడ్డును వందడుగులకు విస్తరిస్తున్నామని, 90 అడుగులకు ఎలా తగ్గిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం దగ్గర నుంచి ఎమ్మెల్యే పైసా తీసుకురాకుండా రోడ్డు విస్తరణ విషయంలో ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ కల్పించుకుని ప్రజలను మభ్యపెట్టే నైజం తమ ఎమ్మెల్యేకు లేదని, అటువంటిది మీరేనంటూ ఆమె విమర్శలను తిప్పికొట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం నెలకొంది. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల విమర్శలు, ప్రతి విమర్శలతో సభలో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి ఏర్పడింది. చైర్‌పర్సన్ కల్పించుకుని అభివృద్ధిని అడ్డుకుంటుంది మీరేనంటూ టీడీపీ కౌన్సిలర్లపై మండిపడ్డారు. అడ్డంకులు సృష్టించకపోతే మెయిన్ రోడ్డు విస్తరణ ఎప్పుడో పూర్తయేదన్నారు. టీడీపీ హయాంలో 70 శాతం పనులు పూర్తి చేసిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని టీడీపీ కౌన్సిలర్లు రామరాజు, ధనిమిరెడ్డి మధు అన్నారు. టిడ్కో గృహాల గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదని చైర్‌పర్సన్ ఘాటుగా సమాధానమిచ్చారు. ఐదేళ్ల అధికారంలో ఉండి లబ్ధిదారులకు గృహాలు కేటాయించకపోవటం టీడీపీ చేసిన ఘోర తప్పిదమన్నారు. సమావేశంలో కమిషనర్ రవిబాబు, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవొద్దు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు

నాతవరం: ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా అధికారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు కోరారు. గురువారం నాతవరంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. కొంత మంది అధికారులు, రైస్‌మిల్లర్ల వ్యవహారశైలి కారణంగా రైతులకు ఇబ్బందులు పడుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నెల 30న నర్సీపట్నంలో సామాజిక బస్సు యాత్ర ముగిసిన వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సివిల్ సప్లయి అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను వారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఏవో శైలజ మాట్లాడుతూ ప్రభుత్వమే గోనె సంచులు, హమాలీల కూలి, రవాణా చార్జీలు భరిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజులోపు రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. సర్పంచ్ గొలగాని రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు చెక్కా జోగిరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు

పంచాయతీ రాజ్‌శాఖ ఈఈ నగేష్‌బాబు


భవనాల ప్రారంభోత్సవంపై వైస్ ఎంపీపీ శ్రీనాగోపితో చర్చిస్తున్న పీఆర్ ఈఈ నగేష్‌బాబు

నాతవరం: ఇంతవరకు పనులు చేసిన నూతన భవనాలకు బిల్లులు చెల్లించామని పంచాయతీరాజ్ శాఖ ఈఈ వి.ఎస్.నగేష్‌బాబు తెలిపారు. చమ్మచింత, పెదగొలుగొండపేట, నాతవరం, వై.డి.పేట గ్రామాల్లో సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ నూతన భవన నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. పెదగొలుగొండపేటలో అసంపూర్తి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణలకు సూచించారు, చమ్మచింతలో భవనాల ప్రారంభోత్సవం ఏర్పాట్లుపై వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, సర్పంచ్ వెలకాడ కాండబాబుతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 220 గ్రామ సచివాలయాలకు 145, ఆర్బీకేలు 204కుగాను 90, హెల్త్ క్లినిక్ కేంద్రాలు 182కుగాను 40 భవనాలు పూర్తి చేశామన్నారు. కోర్టులో కేసులు కారణంగా గునుపూడి, ఎస్.రాయవరం, చీడిగుమ్మల, లచ్చన్నపాలెం, ఉమ్మలాడలతోపాటు మొత్తం ఏడు చోట్ల వీటి పనులు ప్రారంభించలేదన్నారు. మిగతా చోట్ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి చేరిక అవాస్తవం

టీడీపీపై ఎల్.పొన్నవోలు సర్పంచ్ ప్రభాకరరాజు ఆగ్రహం


మాట్లాడుతున్న సర్పంచ్ ప్రభాకరరాజు, నాయకులు

మాడుగుల: సామాన్యులకు కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని సర్పంచ్ వేగేసిన ప్రభాకరరాజు తెలిపారు. గురువారం రాత్రి ఎల్.పొన్నవోలులో గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎల్. పొన్నవోలులో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సామాన్యులకు టీడీపీ కండువాలు కప్పి తమ పార్టీ నుంచి చేరారని చెప్పడం తగదన్నారు. టీడీపీ కండువాలు కప్పిన వారిలో పాము అప్పారావు, ఆట్ల కుల్లయ్య, గంటమల్ల ఎర్రయ్యమ్మ, ఈటి వరహాలు, ఆట్ల ఎరుకులమ్మ, గంటమల్ల అమ్మాజీ, మంచుపల్లి కన్నయ్య, ఆట్ల కుల్లయ్య వైఎస్సార్ సీపీకి చెందిన వారు కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు జోగాడ లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ గండిపడాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గంటమల్ల చినతల్లి, నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన


డ్రోన్ పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో శైలజ

నాతవరం: కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఆధునిక వ్యవసాయ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏవో శైలజ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో డ్రోన్‌తో పొలాలకు పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ సమయంలో స్వల్ప పెట్టుబడితో పొలాల్లో డ్రోన్‌తో పిచికారీ చేయవచ్చున్నారు. ఈ యంత్రాన్ని ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పోలుపర్తి వెంకటరమణ, చెక్కా జోగిరాజు, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.